# కటౌట్ చూస్తూ.. బ్రేకులు వేస్తూ

• నివ్వెరపోతున్నవాహనదారులు.. • ప్రమాదాల నివారణకు సరికొత్త ఆలోచన




**ప్రజానావ, ఆదిలాబాద్:** ప్రమాదాల నివారణకు సరికొత్త ఆలోచనతో జిల్లా పోలీస్ యంత్రాంగం ముందుకు వెళ్తుంది. జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించడంతో పాటు వేగ నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లాలో రెండు చోట్ల ప్రమాద స్థలాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పోలీసు వాహనం, ట్రాఫిక్ కానిస్టేబుల్ తో కటౌట్ ఏర్పాటు చేశారు. దీంతో అటువైపు వెళ్తున్న వాహనదారలు పోలీసుతో ఉన్న కటౌట్ బొమ్మను చూసి అక్కడ పోలీసులు ఉన్నారని గమనించి వాహనాల వేగాన్ని తగ్గిస్తూ దగ్గరకు వెళ్లి చూసేసరికి అవాక్కవుతున్నారు. జిల్లాలోని గుడిహత్నూర్ మండలంలోని మేకల గండి, నేరడిగొండ మండలంలోని బంధం ఎక్స్ రోడ్డు వద్ద పోలీసు వాహనం, కానిస్టేబుల్ తో కూడిన కటౌట్లను ఏర్పాటు చేశారు. ప్రజలు, వాహనదారులు వేగ నియంత్రణ, ట్రాఫిక్ నిబం ధనలు పాటించే విధంగా కృషి చేయడం జరుగు తుందని, ప్రజల రక్షణ కోసం జిల్లా పోలీసు యంత్రాంగం వినూత్న రీతిలో సేవలందిస్తూ తమదైన శైలీలో జిల్లా ప్రజలకు చేరువవుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ప్రజానావ, ఆదిలాబాద్:** వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం తాంసి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ప్రాథమిక వ్యవసాయ సాహకార సంఘాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. అదేవిధంగా సంఘంలో యూరియా నిల్వలు, రైతుకు ఈ పాస్ మిషన్ ద్వారా అందిస్తున్న తీరును పరిశీలించారు. భీంపూర్ మండల సబ్ సెంటర్ లో నిల్వ ఎంత ఉంది, నానో యురియాకు సంబందించిన వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అన్ని వార్డులను పరిశీలించారు. సంబంధిత రిజిష్టర్ ను పరిశీలించారు. మూడు విడతలుగా తీసుకోవాల్సిన డోస్ లపై ఆరా తీశారు. రిజిష్టర్ లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే బెడ్ షీట్స్ ఎన్ని రోజులకు శుభ్రం చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని ఆదేశించారు. రిజిష్టర్ ను పరిశీలించి గైర్హాజరైన వారి గురించి వివరాలు సేకరించాలని డాక్టర్ శ్రావ్యను ఫోన్ లో ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని తెలిపారు. ఆర్ఎంపీల వద్దకు వెళ్లవద్దని, తక్షణమే రోగం నయం కావడానికి ఎక్కువ డోస్ గల ఇంజక్షన్ లు ఇస్తారని, అది భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆర్ఎంపీల వద్ద వైద్య పరీక్షలు చేయించుకోవద్దని సూచించారు. ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చెపడుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.. అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని అన్నారు.

### ఎక్కువ మొత్తంలో యూరియా వాడొద్దు..

జిల్లాలో వానాకాలం పంటలో ఎక్కువగా పత్తి పంట ను వేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. 4లక్షల 50 వేల ఎకరాల పత్తి సాగు చేయడం జరిగిందని, 30 నుంచి 40 టన్నుల యూరియా అవసరం పడుతుందని తెలిపారు. ఇప్పటివరకు 30వేల టన్నులు అమ్మడం జరిగిందని, ఇంకా 10వేల టన్నుల యూరియా వచ్చేనెల వరకు పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. కానీ రైతులు ఎక్కువగా యూరియా వాడకూడదని, శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారని అన్నారు. నానో యూరియా మంచిదని, ఒకేసారి మొత్తం తీసుకెళ్లవద్దని, యూరియా అన్ని షాపులో అందుబాటులో ఉందని, అవసరం ఉన్నంత మేరకే తీసుకెళ్లాలని సూచించారు. యూరియా ఈ పాస్ మిషన్ ద్వారానే తీసుకోవాలని, మధ్య దళారులను ఆశ్రయించవద్దని అన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ లక్ష్మీ, సంబంధిత అధికారులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో పలురవురి చేరిక



**ప్రజానావ, నేరడిగొండ:** ఇచ్చోడ మండలంలోని ధర్మ పురి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ సమక్షంలో మంగళవారం హస్తం గూటికి చేరారు. ఈ సదంర్భంగా ఆడే గజేందర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లడుతూ బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో అభివృద్ధికి అడుగులు వేసే దిశగా ప్రజాపాలన నడుస్తున్నందని, దీంతోనే తాము పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో కాంబ్లే దశరథ్, పాండురంగ, కాంబ్లే దయానంద్, పుండలిక్, తాతే రావు, దేవురావు, ఉద్ధవ్, చంద్రకాంత్, విఠల్, నారాయణ్, జనార్ధన్, శివాజీ తదితరులు ఉన్నారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సర కాలంలోనే రైతులకు రుణ మాఫీ, వరి పండించిన రైతులకు రూ.500 బోనస్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, యువతకు 60వేల ఉద్యోగాలు భర్తీ, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు, మహిళా సంఘాలకు రుణాలు, గ్యాస్ సబ్సిడీ, ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల మంజూరు, పేదల కోసం సన్న బియ్యం లాంటి పథకాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ప్రవీణ్ పాటిల్, ఆత్మ డైరెక్టర్ కదం శివ, మాజీ ఎంపీటీసీ మహేందర్, యువజన అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి, ఎండి సద్దాం, వసంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించాలి

**ప్రజానావ, జైనూర్:** జైనూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వైద్య సిబ్బందిని నియమించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్ర పరిధిలోని నాలుగు మండలాల ప్రజలు వైద్యం కోసం ఇక్కడికే వస్తున్నారని, అరకొర సిబ్బందితోనే పీహెచ్‌సీ నడుస్తోందన్నారు. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అలాగే స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఒకే డాక్టర్‌తో వైద్యం కొనసాగించడం సాధ్యపడడం లేదని అన్నారు. జైనూర్ ఆరోగ్య కేంద్రంలో అవసరమైన వైద్య సిబ్బందిని నియమించాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



# అచ్చులాపూర్‌లో ఆటో టైర్ల చోరీ



**ప్రజానావ, తాండూర్:** తాండూర్ మండలంలోని అచ్చులాపూర్ గ్రామంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటో టైర్లు చోరీకి గురయ్యాయి. బాధితుడు వేముల రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతిరోజులాగే తాను సోమవారం రాత్రి కూడా ఆటోను తన ఇంటి ముందు ప్రధాన రహదారి పక్కన ఉంచినట్లు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆటోకు ఉన్న మూడు టైర్లను అపహరించినట్లు పేర్కొన్నారు. చోరీ విషయంపై తాండూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# డీఈఓగా అదనపు బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



**ప్రజానావ, ఆసిఫాబాద్:** జిల్లా విద్యాశాఖ అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి మంగళవారం అదనపు పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవస్థను పటిష్ట పర్చేందుకు, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విద్యా శాఖ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 6న చలో హైదరాబాద్



**ప్రజానావ, తాండూర్:** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లుల సాధన కోసం ఈనెల 6న రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ హైదరాబాద్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డి రాజారాం అన్నారు. మంగళవారం కార్మికులతో కలిసి ఎంఈఓ కార్యాలయ డాటా ఎంట్రీ ఆపరేటర్ ప్రశాంత్కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు రామగిరి వరలక్ష్మి, అక్క పెల్లి కమల, ఉరడి సరిత తదితరులు పాల్గొన్నారు.

# తాపీ సంఘం జెండా ఆవిష్కరణ



**ప్రజానావ, తాండూర్:** భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆవిర్భావ దినోత్సవం సదర్భంగా మండల కేంద్రంలోని తాండూర్ తాపీ సంఘం భవనం వద్ద ఆ సంఘం నాయకులు మంగళవారం జెండా ఆవిష్కరించారు. అనంతరం తాపీ సంఘం నాయకులు మాట్లాడుతూ కార్మికుల కోసం 2003 ఆగస్టు 5న కార్మిక సంఘం ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసి కార్మికుల సంక్షేమానికి పాటుపడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు సంక్షేమ పథకాలు కార్మికులకు అందేవిధంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాపీ సంఘం నాయకులు అశోక్, తాండూరి మొండయ్య, జాఫర్ ఖాన్, వన్నే జాజుల శ్రీనివాస్, పూదరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**ప్రజానావ, నేరడిగొండ:** మండలంలోని జాతీయ రహదారి 44పై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుందని ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని సల్యాడ గ్రామానికి చెందిన చిక్రం సోమేశ్ అనే యువకుడు తన స్నేహితుడు తొడసం హన్మంతుతో కలిసి సోమవారం రాత్రి సమయంలో బైక్ పై రాయదారి గ్రామ నుంచి ఇచ్చోడ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని లింగట్ల గ్రామ సమీపంలో లారీని వేగంగా ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, హన్మంతుకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.




## గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు



**ప్రజానావ, తాండూర్:** తాండూర్ మండలంలోని కాసిపేట గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశు వైద్య అధికారి డాక్టర్ నరసింహ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలి నాలుక వ్యాధి ప్రధానంగా గొర్రెలలో నోరు, ముక్కు నుంచి నీరు కారడం జ్వరం లాల జలం కారడం ఉంటుందని తెలిపారు. గొర్రెల కాపరులు గొర్రెలకు తప్పనిసరిగా నీలి నాలుక టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది అన్నం మల్లేష్, దుర్గం కళ్యాణ్, గొర్రెలు పెంపకం వృత్తి దారులు సంఘం నాయకులు కొండ మల్లన్న, కొమ్మ పెంటయ్య, దాడి నరేష్, కొండూ జగ్గయ్య, పూర్ర పోశం, శంకరి మహేష్, నగేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



**ప్రజానావ, నేరడిగొండ:** ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఆదివాసీలు ఘనంగా నిర్వహించుకోవాలని మండల ఆదివాసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని కుమురంభీం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల కేంద్రంలో నిర్వహించే ర్యాలీలో అన్ని గ్రామాల ఆదివాసీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఆత్రం గంగారాం, ఆత్రం నగేష్, మండలంలోని గ్రామ పటేళ్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు



**ప్రజానావ, బెల్లంపల్లి:** బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నటుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మారం దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మైనింగ్ ప్రతి విభాగంలో 50 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కళాశాల వద్ద దరఖాస్తులను సమర్పించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 8న స్పాట్ అడ్మిషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన

**ప్రజానావ, బెల్లంపల్లి:** బెల్లంపల్లి మండల కన్నాల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సాహిస్తూ రైతులకు సబ్సిడీపై మొక్కలు అందిస్తుందని అన్నారు. నాలుగు సంవత్సరాల వరకు నిర్వాహణ ఖర్చుల కింద నగదు ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీ రైతులకు 80శాతం రాయితీ ఉందని తెలిపారు. రైతులందరు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏఈఓ సీహెచ్ తిరుపతి, గురజాల ఏఈఓ శ్రీను, మాట్రిక్స్ ఫీల్డ్ ఆఫీసర్ హర్షవర్ధన్, రైతులు పాల్గొన్నారు.



# ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



**ప్రజానావ, బెజ్జూర్:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్ లో మండల సర్మెడి కొడప శంకర్ అధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో ఆగష్టు 9 నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలకు ప్రత్యేకమైన రోజు ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అని తెలిపారు. ఆరోజు బెజ్జూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ తెగల ప్రజలందరూ తమ తమ గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు.. అనంతరం బెజ్జూర్ మండల కేంద్రంలో భారీ ఎత్తున నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెబుతూ, ఆదివాసీలు ఐక్యమత్యంతో ఉంటూ తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెందోర్ సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొడప విశ్వేశ్వర్ రావు, గోండ్ వాన పంచాయతీ రాయిసెంటర్ జిల్లా సర్‌మేడి కుర్సింగ మోతిరాం, బెజ్జూర్, పెంచికల్ పెట్ సర్‌మేడిలు, కొలవార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్రం బక్కయ్య, కొలవార్ సంఘ నాయకులు, ఆదివాసి మహిళ సంఘం మండల అధ్యక్షురాలు ఏనుక అమృత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పోర్తేటీ శ్రీదేవి, తుడుం దెబ్బ నాయకులు, ఆదివాసీ సర్పంచులు, వివిధ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చేరువలో పాఠశాల ఏర్పాటుకు చర్యలు



### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజానావ, మంచిర్యాల:** ప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు చేరువలో పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మరమ్మత్తులు అవసరం కలిగిన పాఠశాల భవనాలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో రామ్ నగర్ లో గతంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలమైనందున స్థానిక విద్యార్థులకు విద్య అందించేందుకు నూతనంగా పాఠశాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉట్నూర్ పాలిటెక్నిక్ ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

**ప్రజానావ, ఆదిలాబాద్:** పాలిటెక్నిక్ లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ఉట్నూర్ ప్రభుత్వ మోడల్ రెసిడెన్సియల్ (జీఎంఆర్) పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వుండేటి యాకోబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ మండలంలోని లాల్ టేకిడి ఆవరణలో గల బాలుర జిఎంఆర్ పాలిటెక్నిక్ లో డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (డీఈఈఈలో-42 ఖాళీలు), డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ (డీఎంఈ-56 ఖాళీలు) రెండు బ్రాంచ్‌లలో స్పాట్ అడ్మిషన్ ద్వారా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. డిప్లొమా చేయాలని ఆసక్తి కలిగిన పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి అడ్మిషన్ పొందని వారు, ఎంట్రెన్స్ పరీక్షలు లేకుండా డైరెక్ట్ చేరాలనుకునే విద్యార్థులకు ఇది మంచి అవకాశమని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు పత్రాలను ఆగస్టు 5 నుంచి 10వ తేది లోపు కళాశాలలో అందజేయాలని సూచించారు. ఆగస్టు 11న ఎంపికైన వారి జాబితాను ప్రకటిస్తామని, ఈ అవకాశాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం డి రాజేశ్వర్ (9949763624-సాధారణ విభాగం), రాములు (7981599545-ఎలక్ట్రికల్ విభాగం), పి గజానంద్ (9441375175 మెకానికల్ విభాగం)లను సంప్రదించాలని కోరారు.

## నూతన పద్ధతిలో వ్యవసాయం లాభదాయకం

**ప్రజానావ, పటాన్ చెరు:** నూతన పద్ధతులలో వ్యవసాయం ఎంతో లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి కే.శివప్రసాద్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన గుమ్మడిదల రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కే.శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వెదజల్లే పద్ధతిలో వరి పండించడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. దీనితో పంట దిగుబడి అధికంగా రావడంతో పాటు సమయం, ఖర్చు రెండు ఆదా అవుతాయని ఆయన వివరించారు. రైతులు ప్రతి మంగళవారం జరిగే రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం పంటలలో ఎరువుల వాడకం తగు మోతాదులో వాడాలని అన్నారు. యూరియాకి బదులు నానో యూరియాను వాడాలని సూచించారు. రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగు వైపు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల అగ్రికల్చర్ ఆఫీసర్ డి శ్రీనివాసరావు, ఏఈఓ నికిత, ప్రణవి, రైతులు ,తదితరులు పాల్గొన్నారు.





## అక్రమంగా డీజిల్ నిల్వ బంక్‌పై 6ఏ కేసు

**ప్రజానావ, మంచిర్యాల:** అనుమతులు లేకుండా అక్రమంగా డీజిల్ నిల్వ చేయడంపై 6ఏ కేసు నమోదు చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య తెలిపారు. మంగళవారం తనిఖీల్లో భాగంగా జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామం పరిధిలోని రొమ్మిపూర్ ఆమ్లెట్ గ్రామంలో సరైన అనుమతులు లేకుండా అక్రమంగా డీజిల్ నిల్వ చేసిన మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ డీజిల్ బంక్ పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ డీజిల్ బంక్ వారు ఫామ్-బి అనుమతి లేకుండా అక్రమంగా 8వేల 141 లీటర్ల డీజిల్ ట్యాంకుల్లో నిలువ చేశారని, తెలంగాణ పెట్రోలియం ప్రొడక్ట్ 2016 ప్రకారం ఎవరైనా 2వేల 500 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్ నిల్వ ఉంచితే తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సూచించారు.. నిబంధనలు ఉల్లంఘించి లైసెన్స్ లేకుండా డీజిల్ నిల్వ చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖురేషి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజానావ, ఉట్నూర్:** ఉట్నూర్ మండలంలో గల ఖురేషి సంఘానికి నూతన కార్యవర్గాన్ని మంగళవారం మస్జిద్ ఏ నూర్ లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌస్ ఖురేషి, సెక్రెటరీగా ఫహీం ఖురేషి, ఉపాధ్యక్షుడిగా మాజీద్ ఖురేషితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖురేషిల సమస్యల పరిష్కారం దిశగా కమిటీ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ ఏ నూర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



